# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 21-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు సహాయం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.
- రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.
- రాష్ట్రంలో అభివృద్ధి పథకాలకు కేంద్ర ప్రభుత్వం నుండి పూర్తి సహకారం లభిస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

========================

అల్పపీడన ప్రభావంతో ఉత్తరాంధ్రలో భారీగా వర్షాలు కురుస్తుండడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులు ఉత్తరాంధ్రలోని వివిధ జిల్లాల్లో ప్రస్తుత పరిస్థితులను ఆయన వివరించారు. అలాగే.... కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రికి తెలియజేశారు. భారీ వర్షాలు ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయడం జరిగిందని, ముందు జాగ్రత్త చర్యగా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించినట్లు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి... పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో వర్షాలు తగ్గాక పంట నష్టం వివరాలు సేకరించి, రైతులకు సాయం అందేలా చూడాలని ఆదేశించారు. భారీ వర్షాలకు సంబంధించిన సమాచారం రైతులకు ఎప్పటికప్పుడు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు.

========================

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను బలోపేతం చేసేందుకు అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈరోజు ఆయన పార్వతీపురంలో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో 6 కొత్త ఆర్టీసీ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కొత్తగా 2 వేల విద్యుత్ వాహనాలను ప్రయాణీకులకు అందుబాటులోకి తీసుకొచ్చి సంస్థకు మరింత ఊతమివ్వనున్నామని చెప్పారు. రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతమైన పార్వతీపురం మన్యం జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. కనీస మౌలిక వసతులు లేకుండా జిల్లాల పునర్విభజన జరిగిందని, ఆ కారణంగా జిల్లాలో సరైన రోడ్లు, మౌలిక సదుపాయాలు లేవని అన్నారు.

(వాయిస్ 35 సెకన్లు)

========================

గడచిన ఆరు నెలల్లో రాష్ట్రంలో పాలన గాడిలో పడిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళంలో ఈరోజు ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రజాప్రతినిధులు అందరూ కలిసి పనిచేయడం వల్ల రాష్ట్రంలో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాల నుండి రాష్ట్రాన్ని సాధారణ స్థితికి తీసుకు రావడానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, వారు పండించిన ప్రతీ ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. ధాన్యం అమ్మిన రైతులకు గంటల వ్యవధిలోనే డబ్బులు జమ చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి ... రైతులకు బకాయి పడిన 16 వందల కోట్ల రూపాయలను అధికారంలోకి వచ్చిన వెంటనే చెల్లించామని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

========================

ప్రపంచ ధ్యాన దినోత్సవ వేడుకలు శ్రీకాకుళం అంబేద్కర్ ఆడిటోరియంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ శ్రీకాకుళం జిల్లా శాఖ, జిల్లా యంత్రాంగం సారధ్యంలో ఈరోజు ఘనంగా జరిగాయి. ప్రపంచానికి యోగాను, ధ్యానాన్ని పరిచయం చేసిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకే దక్కుతుందని శ్రీకాకుళం శాసన సభ్యులు గొండు శంకర్ అన్నారు. ధ్యానం, యోగాలతో మానసిక ఉల్లాసం, ఆనందం, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పేర్కొన్నారు. ధ్యానంతో ఒత్తిళ్లను జయించి, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని చెప్పారు. సనాతన హైందవ ధర్మ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ ధ్యానాన్ని.. యోగాను జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.

========================

మంగళగిరికి చెందిన స్కేటర్ మాత్రపు జెస్సీ రాజ్ ప్రధానమంత్రి జాతీయ బాలల అవార్డు-2025కు ఎంపిక కావడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఇది... ఆమె క్రీడారంగంలో సాధించిన అద్భుత ప్రతిభకు దక్కిన గౌరవమని సామాజిక మాధ్యమం వేదికగా ప్రశంసించారు. ఈ అవార్డును జెస్సీ రాజ్... భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకుంటారని తెలిపారు. 9 సంవత్సరాలకే క్రీడా ప్రయాణాన్ని ప్రారంభించిన జెస్సీ రాజ్‌కు క్రీడల పట్ల ఉన్న అంకిత భావం ఆమెకు ఈ గౌరవం వచ్చేలా చేసిందని అభినందించారు.

విరామం

========================

అభివృద్ధి పథకాలకు కేంద్ర ప్రభుత్వం నుండి సంపూర్ణ సహకారం అందుతోందని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరం జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టరేట్ లో ఈరోజు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వ పథకాలు కీలక భూమిక పోషిస్తున్నాయన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 73 కేంద్ర పథకాలు అమలవుతున్నాయని, మరో 20 పథకాలు కూడా త్వరలో అమలు

కానున్నాయని చెప్పారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్.. తదితర ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రి సూచిస్తూ....

(వాయిస్ 28 సెకన్లు)

========================

విశాఖపట్టణం ఆర్కే బీచ్ వద్ద జనవరి 4వ తేదీన జరగనున్న నావికాదళ విన్యాసాల నిర్వహణకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. ఇండియన్ నేవీ, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ కమిషనర్లతో కలిసి ఈ రోజు ఉదయం ఆయన బీచ్ వద్ద క్షేత్రస్థాయి పర్యటన చేశారు. విన్యాసాలకు సంబంధించిన వివరాలను నేవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన వేదిక నిర్మాణం, ఫైర్ వర్క్, లేజర్ షో, డ్రోన్ షోల నిర్వహణ, ఇతర ఏర్పాట్లపై ఆరా తీశారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు హాజరుకానున్న నేపథ్యంలో పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

========================

పారిశుద్ధ్య కార్మికులకు... కార్మిక చట్టాల ప్రకారం కనీస వేతనం చెల్లించాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు డాక్టర్ పి.పి. వావా అన్నారు. విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు ఆయన సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ... సఫాయి కర్మచారుల సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులను అధ్యయనం చేసి, సమాజంలో వారు గౌరవంగా జీవించే అవకాశం కల్పించాలని సూచించారు. వారికి ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని, ఎటువంటి తనఖా లేకుండా బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లోను, సేవా రంగంలోనూ వారికి అనేక అవకాశాలను కల్పించవచ్చని చెప్పారు. సఫారీ కర్మచారి మరణించినప్పుడు కుటుంబ సభ్యులకు ఎటువంటి జాప్యం లేకుండా ఉద్యోగం కల్పించాలని అన్నారు.

========================

రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ గా ప్రొఫెసర్ మధుమూర్తిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. మధుమూర్తి ప్రస్తుతం వరంగల్ నిట్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సభ్యునిగా సేవలందిస్తున్నారు. కాగా... ఆయన ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ గా 3 సంవత్సరాల పాటు కొనసాగనున్నారు.

========================

సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్డీఏ కూటమి ఇచ్చిన... మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు దిశగా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. సూపర్ సిక్స్ హామీలలో ఒకటైన ఉచిత బస్సు పథకం అమలు తీరుతెన్నులను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది.

========================
========================